'అమ్మ'తనానికి ఆపద

- జిల్లాలో పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్ బాధితులు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స
- మూడేళ్లలో 64 వేల మందికి పైగా చికిత్స
- అక్టోబర్ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం

ప్రతి స్త్రీ తన రొమ్ములను అమ్మతనానికి చిహ్నంగా భావిస్తుంది. ఆ అమ్మతనానికే పుండు ఏర్పడితే...అది క్యాన్సర్‌గా మారితే...వారి బాధ వర్ణణాతీతం. ఇలాంటి ఆరోగ్యసమస్యలున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో రోజు రోజుకూ పెరుగుతోంది. సకాలంలో అవగాహన పెంచుకుని మేల్కోకపోతే ప్రాణాలు తీసేసే అవకాశం ఉంది. వంశ పారపర్యంతో పాటు జీవనశైలి కూడా దీనికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. అక్టోబర్ మాసాన్ని రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా ప్రత్యేక కథనం.

– కర్నూలు(హాస్పిటల్)

అన్ని రకాల క్యాన్సర్ చికిత్సకు రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందిస్తోంది. ఇందులో రొమ్ము క్యాన్సర్ కూడా ఉంటోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు పెంచికలపాడులోని విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, కర్నూలులోని ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్‌లలో ఈ సేవలను ఆరోగ్యశ్రీలో ఉచితంగా అందిస్తున్నారు. పాతికేళ్ల క్రితం రాయలసీమ ప్రాంతానికంతటికీ ఒక్కరే క్యాన్సర్ వైద్యనిపుణులు ఉండేవారు. కానీ ఇప్పుడు ఒక్క కర్నూలు నగరంలోనే పాతిక మంది క్యాన్సర్ నిపుణులు చికిత్సలు అందిస్తున్నారు. క్యాన్సర్ బాధితుల్లో 27 శాతం మంది రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అన్ని రకాల క్యాన్సర్‌లలో సర్జికల్ అంకాలజీ కేసులు 54,219 మందికి చికిత్స చేయగా రూ.186.39కోట్లు క్లెయిమ్ అయ్యాయి.



రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం చిత్రం

అలాగే మెడికల్ ఆంకాలజీలో 64,169 కేసులకు గాను రూ.112.36 కోట్లు, రేడియేషన్ ఆంకాలజీలో 53,822 కేసులకు రూ.106.99 కోట్లు క్లెయిమ్ అయ్యాయి. అయితే కేవలం రొమ్ము క్యాన్సర్‌లలో 2019 నుంచి ఇప్పటి వరకు సర్జికల్ ఆంకాలజీలో 20,635 కేసులకు గాను రూ.52.39 కోట్లు, మెడికల్ ఆంకాలజీలో 23,621 కేసులకు గాను రూ.40.25 కోట్లు, రేడియేషన్ ఆంకాలజీలో 19,976 కేసులకు గాను రూ.37.69 కోట్లు నిధులు ఆయా ఆసుపత్రులకు క్లెయిమ్ అయ్యాయి. నాలుగేళ్లలో మొత్తం 64,232 కేసులకు గాను రూ.130.33 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది.

రొమ్ముక్యాన్సర్ వ్యాధి లక్షణాలు

- రొమ్ముల్లో గడ్డలు/బరువుగా అనిపించడం
- రొమ్ముల ఆకృతి, పరిమాణం మారడం
- రొమ్ములు, చంకల్లో స్థిరంగా నొప్పి
- చనుమొనల నుంచి ద్రవాలు బయటకు రావడం
- చనుమొనల చుట్టూ ఎరుపుగా, దద్దుర్లు ఉన్నట్లుగా ఉండటం
- చనుమొనలు లోపలకు చొచ్చుకుపోయినట్లు ఉండటం, ఆకృతి మారడం
- చర్మపు రంగులో మార్పులు చోటు చేసుకోవడం

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

మామోగ్రఫీ స్క్రీనింగ్ ద్వారా ఈ క్యాన్సర్‌లను గుర్తిస్తారు. రొమ్ములో ఏదైనా అసాధారణతను గుర్తించేందుకు ఈ రేడియోగ్రాఫిక్ సాంకేతికత ఉపయోగిస్తారు. 40 ఏళ్లుదాటిన మహిళలు ఏడాదికి ఒకసారి మామోగ్రామ్ పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం.

రొమ్ము క్యాన్సర్ రావడానికి కారణాలు

- జన్యుపరమైన సమస్యలు, జీవనశైలి, పరిసరాల ప్రభావం, వయస్సు పెరిగే కొద్దీ ఈ రొమ్ము క్యాన్సర్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో చిన్న వయస్సులోనే ఈ క్యాన్సర్ ముంచుకొస్తోంది. అంటే 50 ఏళ్లలోపు ఉన్న వారిలో రొమ్ము క్యాన్సర్ బయటపడుతోంది.
- చిన్న వయస్సులో రజస్వలవడం, ఆలస్యంగా మెనోపాజ్ కావడం, లేటుగా పిల్లలు కలగడం, బిడ్డకు తక్కువ కాలం చనుపాలు ఇవ్వడం, ఊబకాయం, తగినంత వ్యాయామం లేకపోవడం, ఊబకాయాన్ని ఉన్న వారికి రొమ్ములో కొవ్వు కణజాలం ఎక్కువగా ఉండటం వల్ల కూడా ఈ క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంది.
- మన ఆహారంతో శరీరంలోకి ప్రవేశించే పురుగు మందులు శరీరంలో ఈస్ట్రోజెన్ లాగా పనిచేస్తాయి. నెలసరి ఆగిపోయిన తర్వాత వచ్చే ఊబకాయంతో రొమ్ము క్యాన్సర్ పెరిగే అవకాశం ఉంది. అంతకు ముందే అధిక బరువు ఉన్న వారిలో కూడా ఈ ప్రమాదం ఉంటుంది.

బిడ్డకు పాలివ్వకపోతే తల్లికి క్యాన్సర్



బాలింత తన బిడ్డకు తప్పనిసరిగా ఏడాదిన్నర వరకు పాలివ్వాలి. లేకపోతే ఆ తల్లికి రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువ. 25 ఏళ్లలోపు ఒక్కసారైనా గర్భం దాల్చకపోయినా, త్వరగా రజస్వల అయ్యే వారిలో, మెనోపాజ్ 55 ఏళ్లు దాటినా కాకపోతే, మెనోపాజ్ తర్వాత హార్మోన్లు వాడేవారిలో, అధిక బరువు ఉండేవారిలో ఈ క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువ. రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉండేందుకు అవగాహన పెంచుకోవాలి. 40 ఏళ్లు దాటిన వారు, ఛాతిలో ఏ చిన్న గడ్డ కనిపించినా వెంటనే రొమ్ము పరీక్ష(మామోగ్రామ్) చేయించుకోవాలి.

– డాక్టర్ ఏఎస్ భార్గవ వ్యాస్, జనరల్ సర్జన్, కర్నూలు

ఆరోగ్యశ్రీలో చికిత్స ఉచితం



అన్ని రకాల క్యాన్సర్‌లు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా నిర్వహిస్తున్నారు. రొమ్ము క్యాన్సర్ వచ్చిన వారు ఎంపిక చేసిన నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డు చూపిస్తే చాలు. జిల్లాలో నాలుగేళ్లలో 64 వేలకు పైగా బాధితులకు చికిత్స అందించాం. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక ఆసరా కింద మరి కొంత సొమ్ము వారి ఖాతాలో పడుతుంది. ఏ ఆసుపత్రిలోనూ ఎవ్వరికీ డబ్బు ఇవ్వాల్సిన పనిలేదు. ఎక్కడైనా డబ్బు అడిగితే మా కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

– డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

క్లుప్తంగా

ర్యాలీకి స్వాగతం

కర్నూలు కల్చరల్: విజయ దశమిని పురస్కరించుకుని కేరళ నుంచి నాగపూర్ వరకు నిర్వహిస్తున్న అశోక, అంబేడ్కర్ ధమ్మా ర్యాలీ గురువారం కర్నూలుకు చేరుకుంది. ప్రజా సంఘాలు, అంబేడ్కర్ సంఘాల నాయకులు బిర్లాగేట్‌లోని జ్యోతి రావు పూలే విగ్రహం వద్ద ఘన స్వాగతం పలికారు. బిడెఫిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షులు చిరంజీవి, వివిధ సంఘాల నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, శేషఫణి, రామశేషయ్య, దామోదరం రాధ, విజయలక్ష్మి, మౌలాలి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలప మాయంపై అధికారుల్లో కదలిక

కర్నూలు సిటీ: నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కలప మాయంపై గురువారం 'సాక్షి' ప్రచురించిన కథనం వల్ల అధికారుల్లో కదలిక వచ్చింది. స్కూల్ హెచ్ఎం మౌలాలి స్పందించి డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డికి లేఖ రాశారు. స్కూల్‌లో నాడు–నేడు పనులు ప్రారంభం కాకముందే రూ.14 లక్షల బిల్లులు అప్‌లోడ్ చేసి, ఏఈ లాగిన్‌లో అప్రూవ్ చేశారని, తన కంటే ముందుగా పని చేసిన హెచ్ఎం రిలీవ్ అయిన తరువాత కూడా 14 చెక్కులు ఇచ్చి, సుమారు రూ.5 లక్షలు డ్రా చేశారని, వీటన్నింటిపై సమగ్రంగా విచారించాలని డీఈఓను కోరారు. అయితే కలప మాయంపై మాత్రం హెచ్ఎం మౌలాలి ఎలాంటి వివరణ ఇవ్వకపోవడం గమనార్హం.

ఫీజు వెనక్కి ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): క్లస్టర్ యూనివర్సిటీలో అక్రమంగా వసూలు చేసిన ఫీజును వెనక్కి ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ డిమాండ్ చేశాయి. గురువారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట క్లస్టర్ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరుసగా సోమన్న, షాబీరుబాషా, శ్రీనివాసులు, కారుమంచి మాట్లాడుతూ క్లస్టర్ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లు విద్యార్థుల నుంచి అక్రమంగా ఫీజు వసూలు చేశారని ఆరోపించారు. వాటిని వెనక్కి ఇవ్వని పక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిరసన

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయం సీనియర్ అకౌంటెంట్ సాంబశివారెడ్డిని సస్పెండ్ చేయడంపై తోటి ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం విధులు నిర్వహించారు. ఇటీవల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ వాట్సాప్ గ్రూపులో పోస్టు పెట్టినందుకు రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ ముందుగా షోకాజ్ నోటీసు ఇచ్చారు. దీనికి సమాధానం ఇచ్చినప్పటికీ సస్పెండ్ చేయడంపై ట్రెజరీలోని ఎస్‌టీఓలు,సీనియర్ అకౌంటెంట్లు, జూనియర్ అకౌంటెంట్లు నిరసన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కర్నూలు సిటీ: జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఓ ప్రైవేట్ హాస్పటల్ ప్రపంచ ఆర్థరైటిస్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ జాయింట్ కీ కన్స్ట్రక్టివ్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ జీఏఎస్ రవిబాబు పాల్గొని కాలేజీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వై పాండు రంగయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ సి శ్రీనివాసరావు, డీన్ ఆచార్య జి.శశికుమార్ పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓ కార్యాలయ ఏఓగా అరుణకుమారి

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ)గా అరుణకుమారి నియమితులయ్యారు. గురువారం ఆమె డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్యను కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఇదే కార్యాలయంలో గతంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆమె పదోన్నతిపై ఏఓగా మచిలిపట్నం బదిలీ అయ్యారు. తాజాగా ఇప్పుడు ఆమె తిరిగి కర్నూలుకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఓ నాగమణిని ఆదోని మెడికల్ కాలేజీకి బదిలీ చేశారు.

స్టెమ్ ల్యాబొరేటరీలు ప్రారంభం

కర్నూలు సిటీ: బిక్యాంపు, కింగ్ మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో డిస్నీ హాట్‌స్టార్ సహకారంతో ఓ యునైటెడ్ వే ముంబయి సంస్థ ఏర్పాటు చేసిన స్టెమ్ ల్యాబొరేటరీలను గురువారం డీఈఓ డా.వి రంగారెడ్డి ప్రారంభించారు.

జీవనశైలి మార్పులతో ఆర్థరైటిస్‌కు అడ్డుకట్ట

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల ఆర్థరైటిస్ సమస్యలను అడ్డుకోవచ్చని మెడికవర్, జెమ్‌కేర్ కామినేని ఆస్పత్రుల డాక్టర్లు సూచించారు. వరల్డ్ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకుని గురువారం ఆయా ఆస్పత్రులలో రోగులకు ఆర్థరైటిస్‌పై అవగాహన కల్పించారు. ఆర్థోపెడిక్ డాక్టర్లు గణేష్ కుమార్‌రెడ్డి, మంజునాథ్, జీఏఎస్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

21, 31 జీఓలను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఆటో కార్మికులకు శాపంగా మారిన జీఓలు 21, 31లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నాయకులు బి.వెంకటేష్, జి.చంద్రశేఖర్, ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు.

త్యాగధనులను గౌరవించుకోవాలి

- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): మన భూమి కోసం పోరాడి అశువులు బాసిన, పోరాడుతున్న వీరులను గౌరవించుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. గురువారం కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'మేరి మాతి మేరా దేశ్, అమృత్ కలాష్ యాత్ర మాతి కో నమన్ వీరోస్ కా వందన్ క్యాంపెయిన్ కింద మన భారతీయ ధైర్యవంతుల జ్ఞాపకార్థం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహించి, అనంతరం దేశం పట్ల వైద్యవిద్యార్థుల నిబద్ధతను పేర్కొంటూ స్వాతంత్ర్యసమరయోదుల జ్ఞాపకార్థం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ లక్ష్మీబాయి, డాక్టర్ ఎస్. సింధియా శుభప్రద, డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

ఫార్మకాలజీకి అభినందన పత్రం

కర్నూలు మెడికల్ కాలేజీలోని ఫార్మకాలజీ విభాగానికి ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్, నేషనల్ కో ఆర్డినేషన్ సెంటర్ ఫర్ ఫార్మకోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా వారు అభినందన పత్రాన్ని పంపించారు. కళాశాలలో శిక్షణలు, వైద్య విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, శిక్షణ, పరిశోధనలు, ప్రాజెక్టులు మెరుగ్గా నిర్వహించినందుకు గాను ఈ ప్రశంసాపత్రాన్ని అందజేస్తూ సదరు సంస్థ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ జయప్రకాష్ మెయిల్ పంపించారు.



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్, వైద్య విద్యార్థులు

అమృత్ కలశ యాత్రలో భాగస్వాములు కావాలి

కర్నూలు (న్యూసిటీ): అమరవీరుల త్యాగాలను దేశ పౌరులు గుర్తించుకునేలా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అమృత్ కలశ యాత్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం యూనివర్సిటీలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తీసుకొచ్చిన మట్టి, బియ్యాన్ని కలశంలో సేకరించారు. అమృత్ కలశ యాత్ర ప్రతిజ్ఞను రిజిస్ట్రార్ విద్యార్థులు, సిబ్బందితో చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి పౌరుడు తనవంతుగా మట్టి, బియ్యాన్ని కలశంలో సేకరించి నెహ్రూ యువ కేంద్రం ద్వారా ఢిల్లీలోని అమరవీరుల స్మారక వేదికకు పంపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప, ప్రోగ్రాం అధికారి డాక్టర్ పాల్ కృపాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక 46వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నరసింహారెడ్డి నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలు విన్న ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని, వీటిని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి పథకాలు అమలు చేయలేదని, ఎంతో ధైర్య సహసాలతో అమలు చేస్తున్న చరిత్ర తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబం వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేటర్ వాసు,నాయకులు శౌరి విజయకుమారి,సరేష్, ఆంజనేయులు, విజయభాస్కర్ రెడ్డి, కమల్‌బాషా పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలులో సంపూర్ణేష్ బాబు సందడి



సంపూర్ణేష్‌బాబుకు బొకే అందజేసి స్వాగతం పలుకుతున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు కల్చరల్: ప్రముఖ కామెడీ కింగ్, సినీ హీరో సంపూర్ణేష్ బాబు కర్నూలులో సందడి చేశారు. గురువారం జ్యోతి మాల్‌లోని ఐనాక్స్‌లో మార్టిన్ లూథర్ కింగ్ చిత్రం ప్రీమియర్ షోలో ఆయన పాల్గొన్నారు. చిత్ర దర్శకులు పూజా కొల్లూరు, నిర్మాతలు ఎస్.శశికాంత్, చక్రవర్తి, రామచంద్ర, కో ప్రొడ్యూసర్ వెంకటేష్ మహా, తెలుగు షార్ట్ ఫిలిం అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌తో కలిసి సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ఈనెల 27న విడుదల చేస్తున్నామన్నారు. ఓటు హక్కుకు ఉండే ప్రాధాన్యతను తెలిపే కథాంశంతో తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఆదరించాలన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

- జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.రంగారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రంగారెడ్డి

కర్నూలు (టౌన్): క్రీడల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.రంగారెడ్డి అన్నారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్, సెపక్‌తక్రా, టెన్నికాయిట్, జిమ్నాస్టిక్స్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది స్కూల్‌గేమ్స్ క్రీడలకు మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్):నియోకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం ఆయన స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలు ఎదురైనప్పుడు తనను కలిసి పరిష్కారం పొందవచ్చన్నారు.

గో సంరక్షణ సభ్యులకు సన్మానం

జిల్లా గో సంరక్షణ మహా సంఘం ట్రస్టు సభ్యులను ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సన్మానించారు. సభ్యులు పి.ఆది మోహన్‌రెడ్డి, పి.శేషయ్య, వి.విజయభాస్కర్‌రెడ్డి, ఎం.శకుంతల, వై.పార్వతమ్మ, జి.ఎం. కవిత, ఎం.జవహర్‌లాల్ బాబు గురువారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సన్మానించి, ట్రస్టు పురోగతికి కృషి చేయాలని సూచించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

కర్నూలు (టౌన్): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక జొహరాపురంలోని డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి బీపీ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సంద్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటి వద్దే అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కంటి అద్దాలు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కైపా పద్మాలతా రెడ్డి, పల్లవి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు భద్రతా చర్యలు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌కు పటిష్టమైన భద్రతను కల్పించేందుకు చర్యలు తీసకుంటామని, అందుకు ఆయా కార్యాలయాల ఉద్యోగులు సహకారం అందించాలని డీఆర్వో కె.మధుసూదనరావు కోరారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు సమీక్ష నిర్వహించారు. పగలు, రాత్రి లేడా లేకుండా అనధికార వ్యక్తులు లోపలికి వస్తున్నారని, కలెక్టరేట్ ఉద్యోగులు కచ్చితంగా ఐడీ కార్డులు ధరించాలని డీఆర్వో సూచించారు. వాహనాల పార్కింగ్ ఎక్కడనేది రెండు రోజుల్లో తెలియజేస్తామన్నారు. సీఐలు మురళీధర్‌రెడ్డి, ప్రసాదు మాట్లాడుతూ కాంపౌండ్ ఎత్తు తక్కువగా ఉండడం, పెరివాఫెరల్ కెమెరాలు లేకపోవడంతో భద్రతా చర్యల నిమిత్తం పోలీసు సిబ్బంది సంఖ్యను పెంచనున్నట్లు చెప్పారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమైన గేట్లను మాత్రమే తెరిచి, మిగతా గేట్లు మూసేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టరేట్ కాంప్లెక్స్ గేట్లు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు.



ప్రధాన గేటును పరిశీలిస్తున్న డీఆర్వో కె.మధుసూదనరావు తదితరులు

మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామల సూచించారు. గురువారం బంగారుపేటలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా మత్స్య సహకార సంఘం అత్యవసర సర్వసభ్య సమావేశంలో జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికల నిర్వహణపై చర్చించారు. త్వరలోనే ఎన్నికను నిర్వహిస్తామన్నారు. సొసైటీ చెరువుల్లో చేప పిల్లల విడుదల, వలలు, పుట్టీల పంపిణీ పథకం గురించి సభ్యులకు అవగాహన కల్పించారు. సమావేశంలో నంద్యాల జిల్లా ఏడీ సంధ్యారాణి, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారులు స్వర్ణలత, చంద్రయ్య, నాగరాజు.బాలరాజు, జిల్లా మత్స్య సహకార సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

కర్నూలు: రోడ్డు ప్రమాదాల నివారణకు నగరంలో ట్రాఫిక్ పోలీసులు గురువారం మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాజ్‌విహార్, గాయత్రి ఎస్టేట్, సి.క్యాంప్ సర్కిల్, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచి 11 మంది మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఆర్‌టీఓకు నివేదించినట్లు సీఐ గౌతమి తెలిపారు.

20 వరకు అభ్యంతరాల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ నుంచి నీటి సరఫరా చేసేందుకు నిర్వహించనున్న రూ.115 కోట్ల నిర్మాణ పనులకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 20 వ తేదీ లోపు తెలియజేయాలని ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే జ్యుడీషియల్ ప్రివ్యూకు సమర్పించినట్లు తెలిపారు. జ్యుడీషియల్ ప్రివ్యూలో కాంట్రాక్టర్లు, ఇతరులు తమ సలహాలు, అభ్యంతరాలను judje@jpp@ap.gov.in లేదా apjudicial precview@gmail.com కు మెయిల్ ద్వారా తెలియజేయాలన్నారు.

దసరా ఉత్సవాల బ్రోచర్లు ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: అనంతపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దసర ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్లను గురువారం నగరంలోని స్థానిక టీజీ ప్రకాష్ కార్యాలయంలో ఆవిష్కరించారు. రాజ్యసభ సభ్యులు మాజీ టీజీ వెంకటేష్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు డీజే వెంకటేష్, జగదీష్‌కుమార్, మధు, నారాయణ, సతీష్, మంజు, అనంతపురం జిల్లా నాయకులు ఆవిష్కరణలో పాల్గొన్నారు.

అన్నదాతకు ఆర్థికంగా చేయూతనివ్వాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

కర్నూలు(సెంట్రల్): పేద రైతులను ఆదుకోవడానికి ఆర్థిక చేయూతను ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభివృద్ధి నిరోధక రాజకీయాల నుంచి ప్రజా సమస్యలపై రాజకీయాలను మళ్లించడమే ధ్యేయంగా సీపీఎం పని చేస్తుందన్నారు. గురువారం బీఎస్ కల్యాణ మండపంలో 'రాష్ట్రంలో వ్యవసాయ రంగ పరిస్థితులు– ప్రత్యామ్నాయ విధానాలు' అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుల లెక్కలు కూడా ప్రభుత్వం వద్ద లేకపోవడం దుర్మార్గమన్నారు. ఒక పక్కవర్షాలు,మరో పక్క పాలకుల అనాలోచిత చర్య ల వల్ల రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.

బీజేపీ నుంచి పవన్ ఏమి ఆశిస్తున్నారో..

ప్రశ్నిస్తానని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఏమి ఆశించి బీజేపీకి మద్దతు ఇస్తున్నారో చెప్పాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలు చేయడానికా, ప్రత్యేక హోదా ఇవ్వడానికా?వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికా దేనికో అర్థం కావడంలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో పాటు టీడీపీ కూడా బీజేపీకే మద్దతు పలుకుతున్నాయిన ఆరోపించారు. బ్యాంకులను మోసం చేసి డబ్బు సంపాదించిన కేటుగాళ్లకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరుతున్నట్లు చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి, వి.రాంభూపాల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏపీ వాటా నీటిని మళ్లించుకొని 117 శాతం అభివృద్ధిని సాధించిందన్నారు. అంతకు ముందు వ్యవసాయ శాస్త్రవేత్త ఎంకే స్వామినాథన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె. జగన్నాథం, సీపీఎం జిల్లా నాయకులు నరసింహులు, రైతుసంఘం కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లా కార్యదర్శులు రామకృష్ణ, రాజశేఖర్, చంద్రశేఖరరెడ్డి, కర్నూలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సీపీఎం కర్నూలు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.నిర్మల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

16 నుంచి చిల్డ్రన్ క్యాంపు గుడ్ న్యూస్

కర్నూలు (టౌన్): ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు స్థానిక కోల్స్ కళాశాల హాలులో చైల్డ్ ఈవాంజిలిసమ్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చిల్డ్రన్ క్యాంపు గుడ్ న్యూస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రభుదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.